# సంక్షేమ కమిటీలు

## (చాప్టర్ 25)

భారత రాజ్యాంగం భారత పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని కల్గజేయటమేగాక, అందరికి సమాన హోదా, అవకాశాలను కల్గించాలని సంకల్పించింది. స్త్రీ, పురుషులకు జీవనోపాధిని పొందేందుకు సమానావకాశాలను, హక్కులను కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తన విధానాలను రూపొందించుకోవాలని కూడా రాజ్యాంగం చెపుతోంది. రాజ్యాంగపు 15వ పరిచ్ఛేదంలోని 3వ ఖండం స్త్రీ శిశువులకు ప్రత్యేక అవకాశాలను కల్గించాలని చెబుతూ పై అంశానికి మినహాయింపుని ఇస్తోంది. రాజ్యాంగపు 16వ పరిచ్ఛేదంలోని 4వ ఖండం ననుసరించి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాలలో తగినంత ప్రాతినిధ్యం లేని ఏదేని వెనుకబడిన తరగతులకు చెందిన పౌరుల పదవీ, ఉద్యోగాల నియామకం విషయంలో కొంత మినహాయింపును కల్గిస్తుంది. అదే విధంగా రాజ్యాంగపు 335వ పరిచ్ఛేదం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకాల విషయంలో అనుసూచిత జాతుల, వర్గాల సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోవాలని సూచిస్తోంది. అదే విధంగా రాజ్యాంగపు 30వ పరిచ్ఛేధం అల్ప సంఖ్యాక వర్గాలకు కొన్ని హక్కులకు హామీ ఇస్తోంది. ఈ కారణాలచేత ఉభయసభలలో సంక్షేమ కమిటీలు ఏర్పడ్డాయి. ఉభయసభలలో ఐదు సంక్షేమ కమిటీలున్నాయి.

1. అనుసూచిత వర్గాల సంక్షేమ కమిటీ
2. అనుసూచిత జాతుల సంక్షేమ కమిటీ.
3. వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ
4. స్త్రీ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ.
5. అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ కమిటీ.

**కమిటీ ఏర్పాటు :**

సంక్షేమ కమిటీలు ఒక్కొక్కదానిలో తొమ్మిది మంది సభ్యులు ఉంటారు. సభాపతి వీరిని శాసనసభ సభ్యుల నుండి నియమిస్తారు.

**అధ్యక్షుని నియామకం :**

ఆయా కమిటీల సభ్యుల నుండి ఒక్కొక్కరిని ఆ సంక్షేమ కమిటీలకు అధ్యక్షులుగా సభాపతి నియమిస్తారు.

**కమిటీ సభ్యుడిగా మంత్రి ఉండరాదు :**

మంత్రిని కమిటీ సభ్యుడిగా ఎన్నుకోరాదు. కమిటీకి సభ్యుడిగా నియమించిన తర్వాత మంత్రిగా నియమితమైన ఆ సభ్యుడు తాను మంత్రి పదవికి నియమితమైన తేదీ నుండి కమిటీలో సభ్యత్వాన్ని కోల్పోతాడు.

**పదవీ కాలం:**

ఈ ఐదు సంక్షేమ కమిటీల సభ్యులు సభాపతి నిర్దిష్టపరచిన సమయం వరకు పదవిలో ఉంటారు. లేక కొత్త కమిటీ నియమితం అయ్యేవరకు పదవిలో కొనసాగుతారు.

**విధులు :**

**1. అనుసూచిత వర్గాల జాతుల సంక్షేమ కమిటీ**

ఈ రెండు కమిటీలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించడం, రాజ్యాంగ చట్టపు 16వ పరిచ్ఛేదం 335వ పరిచ్ఛేదాలలోని నిర్దేశాలను పాటించి ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఉద్యోగాలలో పదవులలో అనుసూచిత వర్గాల, అనుసూచిత జాతుల వారికి తగు ప్రాతినిధ్యాన్ని యివ్వటం, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని, వాటిని అమలు జరపటం, ఇతర అభివృద్ధి చర్యలను సమీక్షించడం ఈ కమిటీల విధులు.

**2. వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ :**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను పరిశీలించడం, రాజ్యాంగచట్టపు 16వ పరిచ్ఛేద నిర్దేశాల్ని వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పాటించి ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఉద్యోగాల పదవులలో వెనుకబడిన తరగతుల వారికి తగు ప్రాతినిధ్యాన్ని సమకూర్చటం, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని, వాటి అమలును, అభివృద్ధి చర్యలను, రాజ్యాంగ రక్షణలను సమీక్షించటం వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ విధులు.

**3. స్త్రీ శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ :**

రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఉద్యోగాల, పదవుల నియామకాల్లో స్త్రీలకు తగినంత ప్రాధాన్యత ఉండేవిధంగా తీసుకున్న చర్యలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. స్త్రీ, వికలాంగులు, వయోవృద్ధుల కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ

కార్యక్రమాలు ఇతర అభివృద్ధి చర్యలు, సాధించిన ప్రగతిని సమీక్షించటం ఈ కమిటీ విధులు.

**4. అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ కమిటీ :**

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమానికి సంబంధించిన విషయాలను కమిటీ పరిశీలిస్తుంది. అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, మెరుగుదల చర్యల పురోగతిని కమిటీ సమీక్షిస్తుంది.

**పరిశీలన నిమిత్తం విషయాల ఎంపిక :**

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వచ్చు అంశాలను విషయాలను ఎప్పటికప్పుడు ఈ సంక్షేమ కమిటీలు ఎంపిక చేస్తాయి. విషయ పరిశీలనకోసం కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు ఆయా కమిటీలు నిర్ణయిస్తాయి.

**ఉప కమిటీల నియామకం :**

వివిధ విషయాలను సవివరంగా అధ్యయనం చేసి పరిశీలించే నిమిత్తం ఆయా సంక్షేమ కమిటీలు ఉపసమితులను నియమించవచ్చు. ఆ విధంగా నియమించిన ఉప కమిటీలు చేయదగు విధులు :

1. వివిధ శాఖలు లేక సంస్థలు అందజేసిన లేదా సంస్థల నుండి తెప్పించిన సమాచారాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయటం.
2. ప్రశ్నావళిని తయారు చేసి, ఆమోదించిన పిమ్మట సంబంధిత శాఖలకు వాటిని పంపటం:
3. ప్రభుత్వ శాఖలు మున్నగు వాటి నుండి అందిన సమాధానాలను పరీక్షించి పరిశీలించటం.



4. ఏ ఏ అంశాలపై చిత్తు నివేదికలను తయారు చేయాలో ఆ అంశాలను స్థూలంగా సూచించటం

కమిటీ తనకు అందిన సమాధానాలను పరీక్షించి, పరిశీలించి నివేదికను తయారు చేస్తుంది. కమిటీ తయారు చేసిన నివేదికను సభకు సమర్పిస్తారు. నివేదిక ప్రతులను సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపుతారు. వాటిపై ఆయా శాఖలు తగిన చర్యలను తీసికొని నివేదికలో సూచించిన సిఫారసులను అమలు జరిపి వాటి అమలుకు సంబంధించిన నివేదికలను పంపమని ప్రభుత్వ శాఖలను కోరతారు. అమలుకు సంబంధించిన నివేదికలను పరిశీలించి ఆయా కమిటీలు తమ నివేదికలను సభకు సమర్పిస్తాయి.

**కమిటీ సిఫారసులపై అమలు నివేదికలు :**

సభా సంఘాలతో సహా, కమిటీల నివేదికలను ప్రభుత్వానికి పంపిన తేదీ నుండి ఆరు నెలలలోగా, ఆ నివేదికలలోని సిఫారుసులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన అమలు నివేదికలను సభకు సమర్పించాలి.

**కమిటీలలోని సభ్యుల ప్రయోజనాన్ని తెలుపుట :**

కమిటీ పరిశీలించనున్న విషయంలో సభ్యునికి వ్యక్తిగతమైన, ఆర్థికపరమైన, లేదా ప్రత్యేకమైన ప్రయోజనమున్నప్పుడు సభ్యుడు/సభ్యురాలు అఫిడవిట్ రూపంలో ఆ ప్రయోజనాన్ని కమిటీ ఛైర్మన్ ద్వారా సభాపతికి తెలపాలి



# 18

## ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్య విధానం సంపుటి

## సంక్షేమ కమిటీలు




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.